క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

మధురపూడి: కోరుకొండ మండలంలో 337 మంది రైతుల నుంచి 2,300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి గౌరీదేవి శనివారం తెలిపారు. రబీలో 5,200 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట వేయగా ధాన్యం కొనుగోలును సివిల్ సప్లయిస్ అధికారులు వేగవంతం చేశారన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ


తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు, పక్కన గ్రంథాలయాధికారి వర్ధన్

పెదపూడి: వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెదపూడి గ్రంథాలయంలోని గ్రంథాలయాధికారి వర్ధన్ అన్నారు. పెదపూడి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆరో రోజు శనివారం విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. చిత్రలేఖన ఉపాధ్యాయుడు రమేష్ విద్యార్థులతో పలు చిత్రాలు గీయించారు. వారిలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన ముగ్గురు విద్యార్థులను అభినందించారు.

భర్త దాడి చేశాడంటూ ఫిర్యాదు

సీతానగరం: తన భర్త కత్తితో దాడి చేసినట్లు ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాల ప్రకారం.. చీపురపల్లికి చెందిన పెద్దే నాగమణి, అర్జున్ భార్యభర్తలు. వరకట్నం కోసం భర్త వేధిస్తున్నట్లు 2020 నుంచి కోర్టులో కేసు నడుస్తుండగా నాగమణి కువైట్ వెళ్లింది. మూడు నెలల కిందట కువైట్ నుంచి తిరిగి వచ్చింది. శనివారం నీటి కోసం కుళాయి వద్దకు నాగమణి వెళుతుండగా మద్యం మత్తులో అర్జున్ కత్తితో దాడి చేశాడు. ఆమె మెడ, నడుము, కుడి చేతిపై నరకడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో కుట్లు వేశారు. ఆసుపత్రి నుంచి వచ్చిన నాగమణి స్థానిక పోలీసులను ఆశ్రయించింది.

కీటకజనిత వ్యాధులపై అవగాహన


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరాజు

గోకవరం: కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో శనివారం రాజమహేంద్రవరం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరాజు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అంటువ్యాధులు, సంక్రమణ కీటకాల ద్వారా వ్యాపించే వ్యాధులు, రక్త పరీక్షల గురించి అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ అశోక్‌వర్ధన్, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రేపు వర్జీనియా పొగాకు వేలానికి అనుమతి

సీతానగరం: దేవరపల్లి టుబాకో బోర్డులో సోమవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన వర్జీనియా పొగాకు బేళ్ల అమ్మకానికి బేళ్లు తీసుకురావాలని టుబాకో బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ ప్రణీత్ శనివారం తెలిపారు. రఘుదేవపురం, చినకొండేపూడి, రాజంపేట, రాపాక, సీతానగరం, వెదుళ్లపల్లి గ్రామాల్లోని వర్జీనియా పొగాకు రైతులు ఒక్కో బ్యారన్‌కు రెండు బేళ్ల చొప్పున దేవరపల్లి టుబాకో బోర్డుకు సోమవారం తీసుకు రావాలన్నారు. ఒక్కో బేలు 150 కిలోలకు మించి ఉండరాదన్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు బేళ్లను కాటా వేస్తారని, తదుపరి వేలం నిర్వహిస్తామని వివరించారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


సీతానగరం ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వీరికి వచ్చే నెల 2 నుంచి పరీక్షలు ఉండడంతో హెచ్ఎం పుష్పలత ఆధ్వర్యంలో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. రోజూ ఆయా సబ్జెక్ట్‌లపై పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నారు. సుమారు 35 మంది విద్యార్థులకు గాను 30 మంది హాజరవుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సైన్స్, సోషల్, గణితంలో తరగతులను ఉపాధ్యాయులు కస్నూరి సతీష్‌బాబు, ముస్తాఫా, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం నిర్వహిస్తున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- యువత కోసం ఓపెన్ జిమ్‌ల నిర్మాణం
- త్వరలో బూరుగుపూడి, గాదరాడ, శ్రీరంగపట్నంలలో ప్రారంభం


బూరుగుపూడిలో అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధమైన ఓపెన్ జిమ్

మధురపూడి: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు.. అలాంటి ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి. దీనికి వ్యాయామ శాలలు (జిమ్) ఎంతగానో ఉపయోగపడతాయి. యువతను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి గ్రామీణ ప్రాంతాల్లో వ్యాయామ శాలల నిర్మాణం జరుగుతోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో సహకారం అందిస్తోంది. అధిక నిధులు కేటాయిస్తుంది. ఇందులో భాగంగానే రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సారథ్యంలో బూరుగుపూడి, గాదరాడ, శ్రీరంగపట్నం గ్రామాల్లో ఓపెన్ వ్యాయామ శాలలను నిర్మించారు. వీటిని అన్ని హంగులతో సిద్ధం చేశారు. ఇవి త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రుడా ఆధ్వర్యంలో నిర్మించిన ఈ వ్యాయామ శాలలకు ఆయా పంచాయతీలు ఖాళీ స్థలాలను అందించాయి. కాగా వీటి నిర్మాణం, వివిధ రకాల వ్యాయామ పరికరాలను సైతం రుడా సమకూర్చింది. అంతేకాకుండా వ్యాయామం చేయడానికి అనువుగా పరిసరాలను తీర్చిదిద్దారు. ఒక్కో వ్యాయామ శాలకు రూ.20 లక్షల చొప్పున కేయించి నిర్మించారు.

సకల సౌకర్యాలతో..

ప్రస్తుతం పోలీస్, ఆర్మీ, నేవీ తదితర పోస్టులకు శారీరక దృఢత్వం చాలా అవసరం. అంతేకాకుండా ఆరోగ్యానికీ వ్యాయామం తప్పనిసరి. యువతకు అనుకూల వేళల్లో జిమ్ చేసుకోవడానికి అనువుగా ఈ వ్యాయామ శాలలను తీర్చిదిద్దారు. అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో యువత వ్యాయామం చేసేందుకు రానున్నారు. ఓపెన్ జిమ్‌గా పిలిచే ఈ వ్యాయామ శాలల్లో పది రకాల పరికరాలను ఏర్పాటు చేశారు. ఇందులో వాకింగ్ పర్పస్, వెయిట్ లిఫ్టర్ తదితర పరికరాలను అందుబాటులో ఉంచారు.

సంపూర్ణ ఆరోగ్యానికి..



ఓపెన్ జిమ్‌లతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు. గత ప్రభుత్వాలు యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. జగనన్న ప్రభుత్వం వారికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఓపెన్ జిమ్‌ల ద్వారా ఆరోగ్యవంతమైన జీవనానికి బాటలు వేస్తోంది.

– కంటే వినయ్‌తేజ, వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు

ప్రేమకు ప్రతిరూపం అమ్మ

నేడు అంతర్జాతీయ మాతృ దినోత్సవం



బిక్కవోలు: కల్మషం లేని ప్రేమకు, అంతులేని మమతానురాగాలకు ప్రతిరూపం అమ్మ.. శిశువు కడుపులో పడినప్పటి నుంచి తాను చనువు చాలించేవరకూ బిడ్డ కోసం అనుక్షణం తపనపడేది అమ్మే.. పిల్లల ఆనందాన్నే తన సంతోషంగా భావించేది మాతృమూర్తి.. అమ్మ ప్రేమ స్వచ్ఛమైనది. ఆమె రుణం తీర్చలేనిది. మాతృమూర్తి గొప్పతనం గురించి ఎంతచెప్పినా తక్కువే. తల్లి ప్రాధాన్యాన్ని గుర్తించి అమ్మ కోసం ఓ రోజు ఉండాలని అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ 1914లో ఏటా మే నెల రెండో ఆదివారాన్ని అంతర్జాతీయ మాతృ దినోత్సవంగా ప్రకటించారు. ఆ రోజున జాతీయ సెలవు దినంగా పేర్కొన్నారు. అమ్మ తోడ్పాటు, అమ్మ ఆసరాతో ఉన్నత పదవులు చేపట్టిన వారెందరో ఉన్నారు. చాలామంది అమ్మ బతికుండగా సరిగా పట్టించుకోకుండా తీరా ఆమె మరణించిన తరువాత అనాథ శరణాలయాలకు సేవా కార్యక్రమాల పేరుతో దాతృత్వం ప్రకటించడం చాలా చోట్ల చూస్తుంటాం. జన్మనిచ్చిన తల్లిని అనుక్షణం కళ్లల్లో పెట్టుకుని చూసుకోవాలన్నదే మాతృ దినోత్సవం ప్రధాన ఉద్దేశం..

తల్లి ప్రోత్సాహంతోనే..



మా అమ్మ వెంకటరత్నం ప్రోత్సాహంతోనే ఉన్నత స్థాయికి ఎదిగాను. కుటుంబంలో చిన్నవాడిని కావడంతో చాలా అపాయ్యంగా చూసుకునేవారు. ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ఎంపీడీవోగా ఉద్యోగం సాధించాను.

– పోకల విజయభాస్కర్, ఎంపీడీవో, పెదపూడి

అడగకముందే అన్నీ ఇచ్చేది అమ్మ



అంతులేని ప్రేమకు అమ్మ నిర్వచనం. అడగకముందే అన్ని ఇచ్చేది అమ్మ. పిల్లల ఆనందాన్నే తన సంతోషంగా భావిస్తుంది. నేను ఈ స్థాయికి ఎదగడానికి మా అమ్మ బేబీ కారణం. మా అమ్మ ప్రోత్సాహం గురించి ఎంత చెప్పినా తక్కువే.

– పి.బుజ్జిబాబు, ఎస్ఐ, బిక్కవోలు

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం


ప్రతిభ కనబరిచిన గురుకుల కళాశాల విద్యార్థులను సత్కరిస్తున్న జూపూడి ప్రభాకరరావు

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు అన్నారు. శనివారం అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ గురుకుల కళాశాలను సందర్శించిన ఆయన 2022–2023 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ఉన్నతికి, సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్, పదోతరగతి పరీక్షా ఫలితాల్లో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే దీనికి నిదర్శనమన్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బి.దుర్గాప్రసాద్, కె.స్టాలిన్, బి.సందీప్, వై.విజయకుమార్, వై.సుభాష్‌తోపాటు పలువురు విద్యార్థులను దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, అనపర్తి వైస్ ఎంపీపీ కర్రి దాసు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేల్, గుబ్బల లాజర్‌బాబు, పాదూరి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజానగరంలో శోభాయాత్ర


రాజానగరంలో ఆంజనేయస్వామి ఆలయం

రాజానగరం: హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాజానగరంలో శోభాయాత్ర (బైకు ర్యాలీ) జరుగనుంది. ఇది సాయంత్రం 4 గంటలకు స్థానిక జెడ్పీ హైస్కూల్ జంక్షన్ వద్ద ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమవుతుంది. అలాగే ఆలయం వద్ద హోమం జరుగనుంది. హనుమత్ జయంతిని వైభవంగా నిర్వహించేందుకు రాజానగరం, సూర్యారావుపేట, పుణ్యక్షేత్రం, నరేంద్రపురం, వెలుగుబంద, చక్రద్వారబంధం, కానవరం తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి.

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన


అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని ఆరికరేవుల గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శంకుస్థాపన శనివారం చేశారు. గ్రామంలోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుదీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామగ్రామాన నిరుపేదలకు ఇంటి స్థలాలిచ్చి వారికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తొండాపు గాంధీరెడ్డి, ఎంపీటీసీ కొర్ల చక్రధరరావు, ఉప సర్పంచ్ శాఖ రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ తులసి

పెదపూడి: పదో తరగతికి సంబంధించి కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు నమోదయ్యాయని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన పది మంది విద్యార్థులకు అభినందన కార్యక్రమం స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు శాలువా కప్పి, మెమొంటో అందించి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల ప్రతిభకు కారణమైన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, క్లబ్ సభ్యులు సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి విశేష పూజలు


రామవరంలో హనుమాన్ చాలీసా సప్తాహ భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

అనపర్తి: మండలంలోని రామవరంలో శ్రీభక్త అభయాంజనేయస్వామి వారి దేవస్థానం 16వ వార్షికోత్సవం శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామవరం పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. సీహెచ్ మారుతీ ప్రసాద్ పర్యవేక్షణలో హనుమాన్ చాలీసా సప్తాహ భజన కార్యక్రమాలు, శ్రీరామ నామ స్మరణ ఏకాహ భజన కార్యక్రమాలు జరిపారు. 14వ తేదీ ఆదివారం ఆలయ ప్రాంగణంలో వల్లీదేవసేన సమేత కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరగనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 14న హనుమజ్జయంతి సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆంజనేయస్వామి జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బిక్కవోలు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పస్లరపూడి గ్రామానికి చెందిన ఎస్. నజీర్‌వుద్దీన్ ఈ నెల 12వ తేదీన రాత్రి బలభద్రపురం నుంచి పస్లరపూడి వ్యాన్‌లో వెళుతూ కొంకుదురు వంతెన వద్ద నిద్రమత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో అతని మెడ వెనుక గాయాలవ్వడంతో అతడిని కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అష్టభైరవ ఆరాధన పూజ


మెళ్లూరులో గ్రామ దేవతలకు హోమం చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం అష్టభైరవ ఆరాధన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు మూలమంత్ర హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిరెడ్డి సత్య సాయిరాం, సత్యకుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

సత్రం భూములపై విచారణ నిర్వహించాలి


రంపయర్రంపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

గోకవరం: సుందరమ్మ సత్రం భూములపై విచారణ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గత 50 యేళ్లుగా సుందరమ్మ సత్రం భూములను కొందరు వ్యక్తులు తమ ఆధీనంలో ఉంచుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. దీనిపై తమ సంఘం ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేస్తున్నా ఎండోమెంట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించి ఈ భూములపై, పాండవుల మెట్ట భూములపై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, శ్రీకాంత్, గోలి ముసలమయ్య, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అనపర్తి: వయోవృద్ధులు సంరక్షణ, పోషణ, సంక్షేమ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు కె.మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ అనపర్తి శాఖ అధ్యక్షుడు పీవీఎస్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనపర్తి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంవీ సుబ్రహ్మణ్యం, జనరల్ సెక్రటరీగా కర్రి సత్యనారాయణరెడ్డి, ట్రెజరర్‌గా తాడి గణపతిరామారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా టీఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చాగంటి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా పంపన కిషోర్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తంటికొండ ఆలయానికి భక్తుల తాకిడి


తంటికొండ వెంకన్న ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గోకవరం: తంటికొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన వెంకటగిరి కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. విద్యార్థులకు సెలవు దినాలు, రెండో శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామి వారికి మేల్కొలుపు సేవ, సుప్రభాత సేవ నిర్వహించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సుమారు 1500 మంది భక్తులు దర్శించుకున్నారని, 314 మంది తలనీలాలు సమర్పించారని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

నీటి కోసం వానరాల వెతుకులాట


మండుటెండలో నీటికోసం వెతుకుతున్న వానర మూక

రంగంపేట: అసలే మే నెల.. సూర్యభగవానుడి ప్రతాపంతో ఎండలు దంచి కొడుతున్నాయి. మెట్టప్రాంతమైన రంగంపేటలో వడగాలులు వీస్తున్నాయి. ఈ దెబ్బకు ఉదయం 10 దాటితే బయట అడుగు పెట్టడానికే భయపడిపోతున్నారు. ఇక మూగజీవాల సంగతి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవొచ్చు. శనివారం ఒక వానర మూక నీటి కోసం పరితపిస్తూ కలియ తిరిగాయి. చివరకు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఒక కుళాయి నుంచి కొద్దిపాటి నీటి దార వచ్చి అక్కడే ఉన్న కుండీలో పడుతుండటం వానరాల కంట పడింది. ఇక వాటి ఆనందానికి అవధులు లేవు. వెంటనే ఒకదాని తరువాత మరొకటి వచ్చి కుండీలోని నీటిని తాగి హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నాయి. అనంతరం బతుకుజీవుడా అంటూ అక్కడే ఉన్న చెట్టుపై సేదతీరాయి. ఈ దృశ్యాలు సబ్‌స్టేషన్ సిబ్బంది దృష్టిలో పడటంతో తమ సెల్‌ఫోన్ కెమెరాలో బంధించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సీతానగరం: ఉండేశ్వరపురానికి చెందిన సింహాద్రి సురేష్‌బాబును కత్తితో పొడిచిన ఉప్పలపాటి శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఉప్పలపాటి శ్రీనివాసరావు తన భార్యతో గొడవపడి మూడు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉంటున్నాడు. కేంద్రం వద్ద ఉమ్ములు, మల, మూత్రవిసర్జన వంటివి చేయడంతో అంగన్‌వాడీ టీచర్ వెంకట జయశ్రీ తన కుమారుడు సురేష్‌బాబుకు తెలిపింది. శ్రీనివాసరావును శుక్రవారం రాత్రి సురేష్‌బాబు మందలించాడు. దీంతో సురేష్‌బాబును కత్తితో పొడిచి, చేతులపై నోటితో కరిచాడు. బాధితుడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని, నార్త్‌జోన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు విచారణ జరుపుతారని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు.